క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో శనివారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీలైన్ పనులు జరుగుతున్న ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహాసభలను జయప్రదం చేయాలి

నార్కట్‌పల్లి : నల్లగొండలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 45వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, జిల్లా మాజీ కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్ఫూర్తి జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీలను ఏర్పాటు చేసిన అనంతరం వారు మాట్లాడారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామానికి చెందిన దయ్యాల మల్లయ్యకు మంజూరైన రూ.60 వేలు, కొమ్ము సాయికుమార్‌కు మంజూరైన రూ.41 వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం చెర్వుగట్టు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వారాల రమేష్, ఈపీసీఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేగట్టె నవీన్‌రెడ్డి, మల్గ శంకర్, కుకుట్ల శ్రీకాంత్, గౌరీదేవి రాజు, గాదరి వెంకట్, శేఖర్, శంకర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు సన్మానం



కవిత,దయాకర్ దంపతులను సన్మానిస్తున్న కాలనీవాసులు

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా శుక్రవారం 48వ వార్డు మాజీ కౌన్సిలర్ యామ కవితా దయాకర్ దంపతులను నల్లగొండలోని నాగార్జున కాలనీ పార్కులో కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

తిప్పర్తి : కేశరాజుపల్లి గ్రామంలో సర్వే నంబర్ 31 లో గల 11 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ భూమిని అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వప్న మాట్లాడుతూ ఈ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నందున ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ప్రసన్న, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు స్వామివారి కల్యాణం

మర్రిగూడ : మండలంలోని సరంపేటలో గల శ్రీస్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మారెపల్లి నరసింహాచార్యులు శుక్రవారం తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం మునగాల సుమన నరేందర్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఉత్తమ వైద్యాధికారి నర్సింహకు సత్కారం

చిట్యాల: వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకున్నారు. దీంతో వెలిమినేడు గ్రామంలోని 'ఓన్లీ మాస్.. నో క్లాస్' వాట్సాప్ గ్రూపు సభ్యులు శుక్రవారం డాక్టర్ నర్సింహను సత్కరించారు. కార్యక్రమంలో మహంకాళి లింగస్వామి, అర్రూరి శ్రీశైలం, దేశబోయిన నర్సింహ, దేవేందర్, మల్లేష్, ఖాజాపాషా పాల్గొన్నారు.


ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి

నాంపల్లి: ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం నాంపల్లి మండలం లింగోటం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర గ్రామానికి చెందిన పూదరి శ్రీకాంత్ (25) పత్తి బస్తాలు వేయడానికి స్నేహితులతో కలిసి ట్రాక్టర్‌పై లింగోటం గ్రామానికి వెళ్లాడు. లింగోటం గ్రామంలో పత్తి బస్తాలు దించి తిరుగు ప్రయాణమయ్యారు. ట్రాక్టర్‌ను శ్రీకాంత్ స్నేహితుడు నడుపుతుండగా... పక్కన కూర్చున్న శ్రీకాంత్ ట్రాక్టర్ పైనుంచి జారి కిందపడిపోయాడు. ట్రాక్టర్ అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల పశువుల కాపర్లు చూడడంతో ట్రాక్టర్ నడుపుతున్న శ్రీకాంత్ స్నేహితుడు ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శోభన్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పర్యాటక కేంద్రంగా మారేనా!



గుట్టపై నిర్మించిన ఆలయం (ఇన్‌సెట్‌లో) నరసింహస్వామి మూలవిరాట్



సరంపేట గ్రామంలోని ఏకశిల కొండ

- ప్రకృతి రమణీయం.. నరసింహస్వామి క్షేత్రం
- ఏకశిల కొండపై వెలిసిన స్వామి వారు
- ఆలయానికి వెళ్లేందుకు దారి లేక భక్తుల ఇబ్బందులు
- కనుమరుగవుతున్న పర్యాటక అందాలు



శిథిలావస్థకు చేరుకున్న పెద్ద కోనేరు



వందల సంవత్సరాలనాటి మర్రిచెట్టు

మర్రిగూడ: మండలంలోని సరంపేట గ్రామంలో ఏకశిల కొండపై రెండు కొండల మధ్య నరసింహస్వామి అవతరించడంతో శ్రీ స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంగా పేరుగాంచింది. స్వామివారి నిలువెత్తు రూపంతోపాటు ఇక్కడి ప్రకృతి రమణీయత ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రతి ఏడాది మాఘ మాసంలో ఆలయ బ్రహ్మోత్సవాలు పది రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 4నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. అయితే కొండపైకి వెళ్లేందుకు సరియైనదారి లేక స్వామివారిని దర్శించుకోలేకపోతున్నామని దారి ఏర్పాటు చేయాలని జాతకు వచ్చే భక్తులు కోరుతున్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇక్కడికొచ్చే భక్తులకు తాగునీటి కోసం వందల ఏళ్ల క్రితం ఆలయం ఎదుట పెద్ద కొనేరు, చిన్న కొనేరులను ఏర్పాటు చేశారు. సకాలంలో వాటికి మరమ్మతులు చేయకపోవడంతో అవి పూడిపోయాయి. అంతేకాకుండా ఆలయానికి సరైన భద్రత లేకపోవడంతో పురాతన కాలం నాటి శ్రీ స్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి, భూమాత పంచలోహ విగ్రహాలు గతంలో చోరీకి గురయ్యాయి. దీనికితోడు ఏకశిల కొండపై పలుమార్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు కూడా జరిపారు. కొండపైన ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు.

నెరవేరని పాలకుల హామీలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కె.చిరంజీవి ఈ కొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తన నిధుల నుంచి రూ.కోటికి పైగా కేటాయించారు. ఇందుకుగాను కేంద్ర పర్యాటక శాఖ అధికారులు గతంలోనే పర్యటించి ఆలయాన్ని పరిశీలించారు. త్వరలోనే అభివృద్ధి పనులను చేపడతామని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఆ పనుల ఊసేలేదు. అధికారులు స్పందించి ఆలయాన్ని అభివృద్ధి చేసి పురాతన సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



ఏకశిల కొండ అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ కొండలో లక్ష్మీనరసింహస్వామి ఉగ్రరూపం ఉంది. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే గొప్ప పర్యాటక కేంద్రంగా అవుతుంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– మారెపల్లి నరసింహాచార్యులు, ఆలయ ధర్మకర్త

భక్తులకు సౌకర్యాలు లేవు



ప్రతి ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కాని ఇక్కడికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు లేవు. దీంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి.

– మారెపల్లి వెంకటాచార్యులు, ఆలయ పూజారి

దాతల సహకారంతోనే ఆలయ అభివృద్ధి

దాతల సహకారంతోనే శ్రీస్తంభగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి సాధ్యమవుతోంది. ఇటీవల కంపచెట్ల తొలగింపు, నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాం. పైపులైన్ కూడా ఏర్పాటు చేశాం. ఆలయం శివన్నగూడ రిజర్వాయర్ పక్కనే ఉన్నందున ప్రభుత్వం స్పందించి పర్యాటక కేంద్రంగా మార్చాలి.

– వర్కాల వెంకటేష్, సరంపేట

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్వాధీనం చేయాలి



మాట్లాడుతున్న హాశం

నల్లగొండ టౌన్ : లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే స్వాధీనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ. సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధన కమిటీ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. 2017లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లులేని పేదల ద్వారా దరఖాస్తులు స్వీకరించి అర్హుల జాబితా రూపొందించి లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిందన్నారు. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకపోవడం వల్ల శిథిలావస్థకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, దండంపల్లి సరోజ, ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, పాక లింగయ్య, భూతం అరుణ, గంజి నాగరాజు, లతీఫ్, శ్రీనివాస్, జహంగీర్, సుల్తాన్, గణేష్, పర్వీన్, సంపూర్ణ, గౌసియా బేగం, జావిద్, అన్వర్ బేగం పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ

చండూరు : సేఫ్టీ మోకులను ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలని ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ కుర్మనాయకులు, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయగౌడ్ అన్నారు. శుక్రవారం చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామంలో సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేఫ్టీ మోకులు వినియోగించడం వల్ల కార్మికులు ప్రమాదాల బారి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు రామారావు, రాకేష్, ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రభాకర్, నల్లగొండ టీం ట్రైనర్స్ వీరయ్య, శంకర్, గీత కార్మికులు అంజయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఇందుగులలో కోళ్ల ఫామ్‌ను పరిశీలిస్తున్న మండల పశువైద్య అధికారి డాక్టర్ వినయ్‌కుమార్

వేములపల్లి(మాడ్గులపల్లి) : ప్రస్తుతం కోళ్లకు వైరస్ సోకి మృతి చెందుతున్నందున పౌల్ట్రీ రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆర్.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో గల కోళ్ల ఫామ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనారోగ్యంగా ఉన్న కోళ్లను గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. చనిపోయిన కోళ్ల నుంచి ఆరోగ్యకరమైన కోళ్లకు రోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కోళ్లను ఎట్టి పరిస్థితుల్లో కుంటలు, కాల్వలు, బహిరంగ ప్రదేశాల్లో పడవేయద్దన్నారు. కోళ్ల ఫామ్‌ల్లో కోళ్లు మరణిస్తే ఆ సమాచారాన్ని మండల పశువైద్యాధికారులకు తెలపాలన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మర్రిగూడ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని దామెర భీమనపల్లిలో నీటి వినియోగంపై ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దామెర బాబురావు నామినేషన్

నల్లగొండటౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు శుక్రవారం ధర్మటీచర్స్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి దామెర బాబురావు నామినేషన్ వేశారు. కార్యక్రమంలో ధర్మా టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామర ఉపేంద్ర, రాష్ట్ర కార్యదర్శి సరిమల్ల నాగరాణి, శంకర్, బొంగరాల నాగయ్య, శ్యామ్, సురేష్, సంజీవ్‌కుమార్, కంజర్ల శ్రీనివాస్, డేవిడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

10న ఇందిరా పార్క్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న ప్రభావతి

నల్లగొండ టౌన్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా, సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి కోరారు. శుక్రవారం నల్లగొండలో జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు బడ్జెట్‌లో సరియైన వాటా దక్కలేదన్నారు. మహిళా సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, పోలెబోయిన వరలక్ష్మి, జిట్టా సరోజ, భూతం అరుణకుమారి, పాదూరి గోవర్ధన, కారంపూడి ధనలక్ష్మి, సుల్తానా, దామెర లక్ష్మి, కనుకుంట్ల ఉమారాణి, జంజరాల ఉమా, నాగమణి, అరుణ పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



పంపపతి

నల్లగొండ : పట్టణంలోని రహమాన్‌బాగ్ కాలనీలో గల అనాథ బాలుర వసతి గృహంలో ఈ నెల 3న గోపాల్ కుమారుడు పది సంవత్సరాల వయసు గల బాలుడు పంపపతిని నల్లగొండ బాలల సంక్షేమ సంఘం వారు చేర్పించారు. అయితే ఆ బాలుడు చెప్పకుండా వసతి గృహం నుంచి వెళ్లిపోయాడు. దీంతో అనాథ బాలుర వసతి గృహం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆచూకీ తెలిసిన వారు ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సెల్ నంబర్ 8712670141, ఎస్ఐ శంకర్ 8712577223 నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్సిడీపై రైతులకు విత్తనాలు అందించాలి

చండూరు : రైతులకు సబ్సిడీపై గ్రాసం, జొన్న విత్తనాలు అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్ రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం ఆయన రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వేసవి సీజన్లో పశువులకు పచ్చి మేత అందించేందుకుగాను రైతులు తమ పొలాల్లో జొన్నలు వేసుకుంటారని, కానీ జిల్లాలో కెనాల్ ఏరియాలో అక్కడక్కడ మినహా సబ్సిడీ జొన్నలు అందుబాటులో లేవని తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శివర్ల యాదయ్య, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



పూసలపాడులో వరి చేను పరిశీలిస్తున్న ఏఓ శివరామ్‌కుమార్

వేములపల్లి(మాడ్గులపల్లి) : రైతులు యాసంగి సీజన్‌లో కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల సూచనలను పాటించి స్వల్పకాలిక విత్తన రకాలను ఎంచుకుని నారు పోసిన 20- 25 రోజుల్లోనే నాట్లు వేయాలని ఏఓ ఎం.శివరామ్‌కుమార్ సూచించారు. మాడ్గులపల్లి మండలంలోని పూసలపాడు, కన్నెకల్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి చేలను ఏఓ వరామ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పొలాలు ముందస్తుగా పొట్ట దశకు చేరుకుంటున్నాయని తమ దృష్టికి రావడంతో పరిశీలించినట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 20 మధ్య నారు పోయడానికి అనుకూలమని, కానీ ముందుగా నారు పోయడంతో పిలక దశలో చలి తీవ్రత కారణంగా పైరు సరిగ్గా ఎదగక తల్లి కర్ర ముందుగా ఈనుతుందన్నారు. చివరగా దమ్ము చేసినప్పుడు డీఏపీని వేసిన తరువాత యూరియా వేయకపోవడం వల్ల కూడా తల్లి కర్ర ముందుగా ఈనుతుందన్నారు. తల్లి కర్ర ముందుగా ఈనితే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 30-36 కిలోల యూరియా వేసుకోవాలని, ఒకవేళ రైతులు రెండో దఫా యూరియా వేసినట్లయితే వెంటనే 2, 3 దఫాల్లో యూరియా కలిపి వేసుకోవాలని సూచించారు. జింక్ లోపం ఉంటే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పది రోజుల్లో రెండుమార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు గోపాల్, శిరీష, పార్వతి, రైతులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని సీఐ భార్య ఫిర్యాదు

శాలిగౌరారం: అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతోపాటూ మరో మహిళను రెండో వివాహం చేసుకుని తనను వేధిస్తున్నాడని ఓ మహిళ ఆబిడ్స్ సీఐ నర్సింహపై ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం బండమీదిగూడెంకు చెందిన కప్పల సోమలింగయ్య-అంజమ్మ కుమార్తె సంధ్యకు యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన కుంభం నర్సింహకు 2012 లో వివాహం జరిగింది. నర్సింహ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆబిడ్స్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వివాహ సమయంలో కట్నకానుకలు మొత్తం అప్పజెప్పారు. పెళ్లయిన కొద్ది రోజులకే అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడం మొదలు పెట్టాడని సంధ్య ఆవేదన వ్యక్తం చేసింది. తట్టుకోలేక 2024 జూన్‌లో తల్లిగారింటికి వచ్చి తన భర్తపై 2024 డిసెంబర్ 18న నల్లగొండ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానంది. అక్కడ చర్యలు తీసుకోకపోవడంతో 2024 డిసెంబర్ 24న శాలిగౌరారంలో ఫిర్యాదు చేశానంది. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో గల తన కుమార్తెను చూసేందుకని ఈ నెల 4న పాఠశాలకు వెళ్లి తన కూతురిని తల్లిగారింటికి తీసుకుని వచ్చానని తెలిపింది. దీంతో తన కుమార్తె కిడ్నాప్‌నకు గురైందని నర్సింహ సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సరూర్‌నగర్ ఎస్ఐ మారయ్య, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, మహిళా హెడ్‌కానిస్టేబుళ్లు శుక్రవారం బండమీదిగూడెం వచ్చి తనను విచారించి వివరాలు నమోదు చేసుకుని వెళ్లారని సంధ్య తెలిపింది. ఈ విషయమై ఆబిడ్స్ సీఐ నర్సింహ వివరణ కోరగా,, తనభార్యతో గొడవలు జరుగుతున్నాయిని దీంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించానని తెలిపారు. ప్రస్తుతం తమ కేసు కోర్టులో ఉందన్నారు.

డ్రగ్స్ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలి



క్యాలెండర్ విడుదల చేస్తున్న విద్యార్థుల

చిట్యాల: డ్రగ్స్ నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వడ్డెగాని మహేష్ కోరారు. చిట్యాలలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందిన సే నోటు డ్రగ్స్ ప్రచార క్యాలెండర్‌ను ఆయన విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్‌శాఖతో కలిసి పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ చిట్యాల పట్టణ అధ్యక్షుడు అవిశెట్టి కిరణ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జిట్ట సురేష్, జిట్ట దినేష్, వెంకన్న, సాయి, గోపి, భరత్, వెంకటేష్, నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

రాజీలేని పోరాటం చేస్తాం

మర్రిగూడ : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, మనోజ్, వరుణ్, సైదా, మణి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక వికాసానికి దోహదం

తిప్పర్తి : క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్‌తో కలిసి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ప్రారంభం

చండూరు (గట్టుప్పల్) : నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్, యువ తేజం కార్యక్రమంలో భాగంగా గట్టుప్పల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో కబడ్డీ పోటీలను శుక్రవారం ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మర్రిగూడ : యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మిషన్ పరివర్తన్- యువతేజం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మండల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు దేహ దారుఢ్యానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కళ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, క్రీడాకారులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి

నల్లగొండ టౌన్ : అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్‌జయరాజ్, చైర్మన్ కత్తుల జగన్‌కుమార్, వైస్ చైర్మన్ కత్తుల తులసీదాస్, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పెరిక అంజయ్య, జేఏసీ పట్టణ అధ్యక్షుడు నాగుల నరసింహ, బుర్రి స్వామి, కత్తుల సన్ని, ఇరిగి ప్రసాద్, రాబర్టు, హరిప్రసాద్, మాతంగి లింగస్వామి, కందుల అంజయ్య, సంజీవ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేణుగోపాలుడు ముస్తాబు

- నేటి నుంచి శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఉత్సవాలు
- 12వ తేదీన స్వామివారి తిరుకల్యాణం



శ్రీవారిజాల వేణుగోపాలస్వామి మూలవిరాట్



ఆలయ ప్రధాన ద్వారం

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని గోపలాయిపల్లి గ్రామ సమీపాన గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం(8వ తేదీ) నుంచి ఈ నెల 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ప్రతీ ఏటా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ముగింపు దశలో ఈ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనవాయితీ. పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం10 రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదిశేషు పడగ నీడన స్వయంభుగా వెలిసిన స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు కొండపై గల ఇతర ఉప ఆలయాలు, ఆంజనేయస్వామి, మూలస్వామిగుట్ట, రామలింగేశ్వరస్వామి, ఆలయాలను తీరొక్క పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఆలయం గుట్ట సేద తీర్చుకుంటున్న ఆవు మాదిరి ఆకారం పోలి ఉండడంతో దీనిని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంగా పిలుస్తున్నట్లు పూర్వికుల ద్వారా తెలుస్తోంది. సుమారు 1800 సంవత్సరాల క్రితం మునుల తపశ్శక్తి, ఉపాసన వల్ల స్వయంభు స్వామి కొలువుదీరారని ప్రతీతి.

బ్రహ్మోత్సవాలు ఇలా..


ఆలయ బ్రహ్మోత్సవాలను శనివారం ఉదయం శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంతో శ్రీకారం చుడతారు. 9న ద్రావిడ ప్రబంధ పారాయణం, తీర్థగోష్ఠి 10న పరమ పదోత్సవం, 11న ధ్వజారోహణ, గరుడముద్ద, చాత్మర అంకురార్పణ, దేవతాహ్వానం, 12న శ్రీ స్వామివారి తిరుకల్యాణోత్సవం, హోమం, బలిహరణ, 13న గరుడ సేవ, బలిహరణం, 14న హనుమంత సేవ, 15న గోపాలాయపల్లి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం, గుట్ట పైన రాత్రి రథోత్సవము, 16న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపోత్సవం, 17న శతకలశాభిషేకం, ధ్వజపట ఉద్వాసన, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవ, పవళింపు సేవలతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. స్వామివారి తిరుకల్యాణోత్సవం, రథోత్సవం, దోపోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

పుష్కరిణి ప్రత్యేకత

అన్ని కాలాల్లో ఇక్కడి కోనేరులో నీరు సమృద్ధిగా ఉండడం విశేషం. దాని నిండా ఆకులు పరుచుకుని విరబూసిన తామర పూలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఫ్లోరిన్ నీరు ఇక్కడ భూగర్భంలో ఉన్నప్పటికీ ఈ కోనేటి నీరు మాత్రం రుచికరంగా ఉండడం విశేషం.


మంత్రిబావి నీరు పవిత్రం

గుట్టపై ఉన్న మంత్రిబావి మూలస్వామి గుట్ట సమీపంలో ఉంది. ఈ బావి నీటిని మహిమ గలదని భావిస్తారు. బావిలోని నీరు ఎక్కడి నుంచి వస్తుంది.. ఎక్కడికి పోతుంది.. అనేది అంతుబట్టని విషయం. ఈ నీటిని తాగినట్లయితే మానసిక రుగ్మతులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. గతంలో సమీప రైతులు ఈ నీటిని తమ పంట పొలాలపై చల్లుకునేవారు.



కోనేరు

ఏర్పాట్లు పూర్తి చేశాం



బ్రహ్మోత్సవాల కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 10 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తాం. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం

– కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్

ఆటోలు ఏర్పాటు చేశాం

శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు నార్కట్‌పల్లి-చిట్యాల రహదారిలో ఆలయం ఆర్చీ ఎదుట ఆటోలు ఏర్పాటు చేశాం.

– అంబటి నాగిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి